# దసరా కానుక

శ్రీమతి బొడ్డు సీతామహాలక్ష్మిగారు

శ్యామలకు వచ్చే భాద్రపదమాసానికి పదమూడు వెళ్ళి పదునాల్గవ ఏడు వస్తుంది. నిండు చందమామ వంటి సుంద్రమైన మొగం, మొగానికితగిన చారడేసి కనులు, ఒడ్డుపొడుగు సరిపోయిన శరీరము, మేలిమి బంగారంవంటి శరీరచ్ఛాయ, అన్నిటికంటె చదువుకున్నదవటం ఆమెను అంతా మెచ్చుకుంటానికి కారణము లైనవి. శ్యామలకు పెండ్లయి రెండుసంవత్సరములు గడిచాయి. ఇంతవరకు శ్యామల అత్తవారింటికి వెళ్ళడం కాని, వినాయకరావు రావటంకాని జరుగలేదు. దానికి కారణం శ్యామలావినాయకరావుల వివాహంలో నాకబలిరోజున పెట్టుపోతలవిషయమై వియ్యంకుల్లిద్దరకుకలిగిన కలహమే.

శ్యామల తండ్రి విశ్వనాథం ఏలూరులో ఒక సాహుకారునద్ద గుమాస్తాగిరీకి కుదురుకొని కుటుంబమును గౌరవముగా గడుపుకొని వస్తున్నాడు. పాపం, శ్యామలకాక ఇంకా యిద్దరు ఆడపిల్లలు పెండ్లికున్నారు. నెల వచ్చేటప్పటికి ఇంటిఅద్దెక్రింద పదిరూపాయలు; కొడుకు రాజారావు బడిజీతంక్రింద, పుస్తకాలక్రింద ఇంకొక పదిరూపాయలు ముక్కుబడిగా చెల్లించవలసినదే. ఇంకా చాకలికి, మంగలికి, దాసీదానికి, అప్పల స్వామికొట్లో కాతావాడకంకు అతీతంరాళ్ళు నాలుగూ తెచ్చేలేవటంతోనే చేతిలోనివి చేతిలో అఖరయేవి. ఆపేదబ్రాహ్మణునకు రాగాపోగా మిగిలేది నెలకొక పచ్చనినిట్టూర్పుమాత్రమే.

*   *   *   *   *

విశ్వనాథం వియ్యంకుడు సీతారామయ్య కలెక్టరుకచేరిలో గుమాస్తా. తనూ, భార్యా, ఒకకొడుకే గనుక జీతం సంసారంక్రిందఅయిపోయినా పైరాబడిమట్టుకు నిల్వచేస్తున్నాడు. సీతారామయ్య మహాలోభి. ఒకవిధంగా తలతిక్కమనిషికూడాను. పెండ్లిలో తనకు మంచిబట్టలు పెట్టలేదని, వియ్యాపరాలి లాంఛనాలు సరిగా ముట్టలేదనీ, అల్లునకు అలకపాన్పుపై కోరిన నూటపదునారులు ఇవ్వలేదని ఇత్యాది క్షుద్రకారణముల చేత పెండ్లి అయినదిమొదలుకొని వారిగడప త్రొక్కలేదు. ఏడాదిలోపల అల్లునితీసుకొనివెళ్ళి బట్టలుపెట్ట వలెనని విశ్వనాథం ఎన్నిఉత్తరాలువ్రాసినా ప్రత్యుత్తరము వ్రాయలేదు. స్వయంగా విశ్వనాథంవచ్చి అల్లునిపంపుటకు వియ్యంకుని చేతులుపుచ్చుకొని బ్రతిమాలినప్పటికి పంపుట కొప్పుకొనక ఖచ్చితంగా నూట పదారులు ఇస్తేగాని పంపనన్నాడు. పెండ్లికిచేసిన అప్పే నెమ్మదిగా తీర్చుకుంటూన్న విశ్వనాథానికి ఈమాటలు వినేటప్పటికి పైప్రాణాలు పైనపోయినవి.

*   *   *   *   *

వినాయకరావు విశాఖపట్నంలో డాక్టరుపరీక్షకు చదువుతున్నాడు. అతనికి తండ్రి అంటే అధిక భక్తి. భయంకూడాను. అందుచేత అత్తవారింటికి వెళ్ళాలని అభిలాషఉన్నా వెళ్ళలేకపోయాడు. తండ్రివద్ద నుంచివచ్చే ప్రతిఉత్తరంలోనూ మామగారింటికి వెళ్ళవద్దన్న హెచ్చరిక తప్పకుండాఉంటూంది. అందుచేత అతనికి వెళ్ళటానికి జంకుగాఉండేది. ఆరోజున తీరుబడిగా ఉండటంచేత అతని మానసనాటకమున జరిగి పోయినప్రదర్శనములన్నీ తిరిగి ప్రత్యక్షముకాజొచ్చినవి. న్యాయమునకు తప్పంతయు తండ్రిగారిదే అను కున్నాడు. డబ్బులేనప్పుడు తనమామగారు అంతకంటె చేసేదేముంది అనుకున్నాడు. మామగారు వ్రాసిన ఉత్తరాలకు తానుకూడా జవాబువ్రాయకపోవటం మూర్ఖ్యం అనుకున్నాడు. కొంతసేపటికి ఆలోచనలన్నీ భార్యవైపునకు తిరిగినవి. రెండేండ్లక్రితంజూచిన తనభార్య ఇప్పటికి ఎట్లా ఉంటుందో? తన్ను గుర్తించ గలదో లేదో అనుకున్నాడు. తమపెండ్లినాటిసంగతులు జ్ఞప్తికితెచ్చుకొనుచు తీయనిఆలోచనలో మునిగి

తెలుసుకున్నాడు. అంతలో పోస్టుబంట్రోతువచ్చి రెండుకవర్లు యిచ్చేడు. ఒకటి తండ్రివద్దనుంచి వచ్చినదని పైవ్రాతనుబట్టి తెలుసుకున్నాడు. రెండవది ఎవరో స్నేహితులు వ్రాశారనుకున్నాడు కాని ఆదస్తూరీ ఎప్పుడూ చూచినట్టు లేదు. అక్షరాలు ముత్యాలవలె ఉన్నాయి. కవరు చింపిచూశాడు. చూచిందే పది సార్లు చూచేడు. ఆనందంపట్టలేక అందులోఉన్న రెండుపంక్తులు పైకి బిగ్గరగా చదివేశాడు.

"మీరు తప్పకుండా ఈవిజయదశమిపండుగనాటికి మాయింటికి రాగోరుచున్నాను.

మీశ్యామల"

తండ్రిగారి ఉత్తరంకూడా విప్పి చదివేడు. అందులో - ఈవిజయదశమికి ఇంట్లో దేవీపూజచేయుటకు తలపెట్టినాముగనుక నీవానాటికి తప్పక రావలసినది - అనిఉన్నది. అది చదుకొనేటప్పటికి అతనికేమీ పాలుపోలేదు. తండ్రిగారియాజ్ఞ ఉల్లంఘించటమా? ప్రియురాలికోరిక తిరస్కరించటమా? ఏదిముఖ్యం.

అతని కేవిధంగానైనా అత్తవారింటికి వెళ్ళాలనివుంది. తండ్రిమాట త్రోసివేయడానికి శక్తిచాలదు. కొంతసేపు అక్కడకని కొంతసేపు ఇక్కడకని అతనిమనస్సు ఉఱ్ఱూటలూగుతూంది. ఈవిజయదశమి ప్రియురాలి కోరికననుసరించి సంతోషంగా ఏలూరులో అత్తవారింట గడపాలనుకున్నాడు. తండ్రికి - ఈదసరాకు మాసహోధ్యాయులమంతా కలసి సింహాచలం వెళ్ళాలనుకుంటున్నాంగనుక మీయుత్తరంప్రకారం రాజాలనందుకు మన్నించవలెను-అని వ్రాసినాడు.

* * * * *

ఇంకా దసరా రెండురోజులున్నదనగానే వినాయకరావు ఏలూరు చేరుకున్నాడు. అత్తమామలకు అల్లుని చూడడంతోనే పరమానందం అయింది. అదివరకు ఆటలతోపాటలతో ఇల్లంతా ఎగరకొట్టే శ్యామల ఇప్పుడు సిగ్గులపెళ్ళికూతురయింది. వినాయకరావునకు మాట్లాడటానికైనా తీరికలేకుండా బావమఱదితో, మరదళ్ళతో ఆటలాడటమేసరిపోయింది. అతనికి అత్తవారుచేసే మర్యాదలకంటే భార్యచూసే ఓరచూపులు ఆనందమిచ్చినవి.

పండుగనాడు విశ్వనాథం వినాయకరావును కూర్చుండబెట్టి తాంబూలమిచ్చి కద్దరుబట్టలు, వారంరోజులు శ్యామల కష్టపడి రంగురంగుల తడపలతో అల్లిన చిన్నపూలబుట్టలో దొడ్లోవి నందివర్ధనగులాబీ పువ్వులు వేసియిచ్చేడు. ఆరెంటిలో ఏదిప్రియమో చెప్పవలెనా? ఆపూలబుట్టకొకవైపున ముద్దులమూటగట్టు అక్షరములతో 'దసరాకానుక' అని వ్రాసినకాగితం అంటించి ఉన్నది. అదిచూచి వినాయకరావు పొందిన సంతోషమునకు మేరలేదు.

మరునాడు వినాయకరావు దసరాకానుకను తన సూటుకేసులో నలగకుండా జాగ్రత్తచేసుకొని అత్తవారిచ్చిన క్రొత్తబట్టలు కట్టుకొని అందరివద్ద సెలవుతీసుకొన్నాడు. తలుపోరచేసుకొని చూస్తున్న శ్యామలతో వెళ్ళివస్తానని కండ్లతోనే మాట్లాడాడు. బావమరది సూటుకేసు చేతితోపట్టుకొని స్టేషనుదాకా ప్రయాణమయ్యాడు. అత్తగారు పోనీ రెండురోజులుండకూడదాఅని మామూలుమాట జారవిడిచింది. మరదళ్ళిరువురు చెరోవైపు చేరారు. మామగారు స్టేషనుకు బండిమాట్లాడుకొని వచ్చి అల్లుని పిలిచేరు. వినాయకరావు మరల అందరివద్ద సెలవుతీసుకొని బండియెక్కేడు. సాయంకాలానికి విశాఖపట్నం సురక్షితంగా చేరాడు.

సీతారామయ్యకు ఈరహస్యవ్యాపారం తెలియలేదు. వినాయకరావు తండ్రిగారికోపానికిలోనుకాలేదు. పాఠకులు తాముకూడా ఈవిషయం గోప్యంగా ఉంచడమే మంచిది.